

పరేడ్‌లో పాల్గొన్న భారత నౌకాదళ సిబ్బంది

భయపెడుతున్న బడి

శిథిలావస్థకు చేరిన పేట్రాయి పాఠశాల భవనం

- ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన
- పట్టించుకోని అధికారులు


పేట్రాయి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

సీలేరు, ఫిబ్రవరి 22:

అసలే శిథిలావస్థకు చేరిన భవనం.. ఆపై శ్లాబ్ పెచ్చులు ఊడి తరచూ విద్యార్థులపై పడుతున్న వైనం. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బాలల తల్లిదండ్రుల్లో భయాందోళన. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన... ఇదీ పేట్రాయి ఎంపీపీ పాఠశాల భవనం దుస్థితి.

జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని పేట్రాయి గ్రామంలోని ఎంపీపీ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 50 మంది వరకు పిల్లలు ఈ పాఠశాలలో చదువుతున్నారు. ఈ పాఠశాల భవనం అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు భయం భయంగా కూర్చుంటున్నారు. గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం కోసం నాడు- నేడు నిధులు లక్షలాది రూపాయలు వెచ్చించి పాఠశాలలను ఆధునీకరిస్తున్నామని ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం పేట్రాయి పాఠశాలను పట్టించుకోకపోవడం దారుణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని వారు కోరుతున్నారు.

పక్షుల గుంపు.... కనులకు ఇంపు


పాడేరు ఆర్ అండ్ బీ డీఈఈ కార్యాలయం పక్కన ఓ చెట్టుపై వాలిన పక్షుల గుంపు

పాడేరులో మోదకొండమ్మ ఆలయానికి సమీపంలోని రోడ్లు, భవనాల శాఖ డీఈఈ కార్యాలయం పక్కన వున్న ఓ వృక్షంపై గత కొన్ని రోజులుగా అధిక సంఖ్యలో పక్షులు గుంపులుగా వచ్చి వాలుతున్నాయి. ఆ పక్షులు ఒకేసారి చెట్టుపై వాలడం, అలాగే ఒకేసారి పైకి ఎగిరిపోవడం చేస్తున్నాయి. పక్షులు చేస్తున్న ఆ విన్యాసాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఈ క్రమంలో చెట్టుపై వాలిన పక్షుల గుంపును 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి/పాడేరు


హెలికాప్టర్ల నుంచి బాంబుల వర్షం

అంబరాన్నంటిన నేవీ సంబరం

ఆకాశంలో అద్భుతాలు

- బాంబులు కురిపించిన జెట్ విమానాలు
- సయ్యాటలాడిన చేతక్ హెలికాప్టర్లు
- తొలిసారి దర్శనమిచ్చిన 'తేజస్' యుద్ధ విమానం
- కనులవిందుగా సాగిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్
- సాగరతీరంలో 'మిలాన్' సందడి


హెలికాప్టర్ నుంచి తాడు సహాయంతో బోటులోకి దిగుతున్న కమెండోలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

వినువీధుల్లో అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. జెట్ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. చేతక్‌లు సయ్యాటలాడాయి. సీ హాక్‌లు...హలో చెప్పాయి. ఇంకా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానం...ఇవన్నీ మిలాన్ ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌లో కనువిందు చేశాయి.

ఆర్‌కే బీచ్‌లో గురువారం సాయంత్రం భారత నౌకాదళం నిర్వహించిన వైమానిక శక్తి ప్రదర్శన కళ్లార్పకుండా చేసింది. మొత్తం 54 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు వాటి శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాయి. పిడుగులు పడుతున్నాయా...అని భ్రమించేలా శబ్దం చేస్తూ దూసుకొచ్చిన జెట్ విమానాలు మిరుమిట్లు గొలిపే బాంబుల వర్షాన్ని కురిపించాయి. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఉపయోగించే చేతక్ హెలికాప్టర్లు వేదిక ముందు అతిథుల ఎదుట అతి తక్కువ ఎత్తులో ఎగురుతూ సయ్యాటలాడాయి. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమం...జాతీయ పతాకంలోని మూడు రంగులు సముద్రంలో నుంచి పైకి ఎగిసేలా పేల్చిన బాంబులతో మొదలైంది. బీచ్‌లో బందీలను విడిపించడానికి కమెండోలు జెమినీ బోట్లపై వచ్చి చేసిన దాడి యుద్ధ రంగాన్ని తలపించింది. ఆకాశంలో ఎనిమిది వేల అడుగుల ఎత్తున ఎగురుతున్న హెలికాప్టర్ నుంచి ఒకరి తరువాత మరొకరుగా దూకిన మెరైన్ కమెండోలు వేదిక ముందు సురక్షితంగా దిగి ముఖ్య అతిథికి జ్ఞాపికను బహూకరించిన సాహస కార్యం అందరినీ కట్టిపడేసింది. మిగ్ 29కు యుద్ధ విమానాల

... మిగతా 7వ పేజీలో

పత్రికా స్వేచ్ఛపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాల్‌దేవ్

పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన


పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నేతలు

పాడేరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):

పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికే ముప్పు అని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్‌దేవ్ అన్నారు. జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై వరుస దాడుల నేపథ్యంలో గురువారం ఆయన తమ శ్రేణులతో కలిసి స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బాల్‌దేవ్ మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు తమకు వ్యతిరేకంగా వున్న జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులకు పాల్పడుతున్న వైనాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు అని, అటువంటి చర్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్న వైసీపీ శ్రేణులను కఠినంగా శిక్షించాలన్నారు. వైసీపీ పాలనలో ప్రజా సంఘాలు, జర్నలిస్టులకే రక్షణ లేని పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులపై దాడులను ఆపాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నేతలు ఎల్.సుందరరావు, చిట్టిబాబు, బొజ్జబాబు, ఎస్ఎఫ్ఐ నేతలు నరేశ్, మత్స్యరాజు, కుమారి, సంధ్యారాణి, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

150 కిలోల గంజాయి స్వాధీనం

నలుగురి అరెస్టు

- లారీ, కారు, బైక్ సీజ్


పట్టుబడిన గంజాయి, నిందితులతో సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్ తదితరులు

అరకులోయ, ఫిబ్రవరి 22: ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు లారీ, కారులో తరలిస్తున్న 150 కిలోల గంజాయిని బుధవారం సాయంత్రం పట్టుకున్నామని సీఐ రుద్రశేఖర్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో సుంకరమెట్ట వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో వస్తున్న లారీ, కారును తనిఖీ చేశారు. లారీలో 100 కిలోలు, కారులో 50 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. లారీ, కారుతో పాటు ఈ రెండు వాహనాలకు పైలట్‌గా వినియోగించిన బైక్‌ను సీజ్ చేశారు. ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు గంజాయి తరలిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాంబాబు, బీరేంద్ర, హుకుంపేటకు చెందిన కొర్రా కోగేశ్వరరావు, పాంగి శ్యాంగనేష్‌లను అరెస్టు చేశారు.

ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

- ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల డిమాండ్
- ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన



ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 22:

ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసి జీవో నంబరు 3కి చట్టబద్ధత కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ 6,100 పోస్టుల్లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఐటీడీఏ పరిధిలో 99 శాతం ఆదివాసీలకు కేవలం 7 పోస్టులను మాత్రమే కేటాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. 2024 డీఎస్సీలో ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతాలైన పాడేరు, పార్వతీపురం, చింతూరు ఐటీడీఏ పరిధిలో ఆదివాసీలకు కేవలం 38 పోస్టులు మాత్రమే ఇవ్వడం ఆదివాసీలకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ద్రోహం చేయడమేనని అన్నారు. జీవో నెంబరు 3 కోసం టీఏసీ తీర్మానం చేశామని, చట్టబద్ధత కల్పిస్తామని గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రకటనలు గుప్పించారన్నారు. ఇటీవల వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో ఆదివాసీలకు అన్యాయం జరుగుతుంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆర్డినెన్స్ జారీ చేసి జీవో నంబరు 3కి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ జీవో నంబరు 3 చట్టబద్ధతకు

... మిగతా 8వ పేజీలో

ఆశ్రమ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంహెచ్‌వో డాక్టర్ సి.జమాల్ బాషా
- మలకపాలెం ఆశ్రమ పాఠశాలలో 112 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు


పాడేరు మండలం మలకపాలెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పాడేరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్‌బాషా తెలిపారు. మండలంలోని ఈదులపాలెం పంచాయతీ మలకపాలెం ఆశ్రమ పాఠశాలలో గురువారం ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య స్థితిగతులను బట్టి వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పాడేరు ఆస్పత్రికి తరలిస్తామన్నారు. మలకపాలెం ఆశ్రమ పాఠశాలలో 112 మంది గిరిజన విద్యార్థులకు ప్రత్యేక బృందంతో వైద్య పరీక్షలు నిర్వహించామని, వారిలో ఇద్దరి ఆరోగ్యం కాస్త విషమంగా ఉంటే మెరుగైన వైద్యం అందించేందుకు పాడేరు ఆస్పత్రికి తరలించామన్నారు. అలాగే విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలను నిర్వహించి, అవసరమైన మందులు అందిస్తున్నామన్నారు. మలకపాలెం ఆశ్రమ పాఠశాలలో కిచెన్ షెడ్, విద్యార్థుల సిక్ రూమ్‌లను పరిశీలించామని డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన ఉష్ణోగ్రతలు


లంబసింగి-రాజుపాకలు మార్గంలో కురుస్తున్న మంచు

పాడేరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):

మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వలంగా పెరిగినా చలి కొనసాగుతున్నది. అరకులోయలో 11.3, జి.మాడుగులలో 12.3, పాడేరులో 13, పెదబయలులో 13.3, హుకుంపేటలో 13.4, ముంచంగిపుట్టులో 13.5, డుంబ్రిగుడలో 14.4, అనంతగిరిలో 15.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి. దీంతో మన్యంలో కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజామున పొగమంచు కురుస్తూ, చలి తీవ్రత కొనసాగుతున్నది.

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో రాత్రి వేళ చలి తీవ్రత అధికంగా ఉన్నది. గురువారం చింతపల్లిలో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో మంచు ఉదయం ఎనిమిది గంటల వరకు అధికంగా కురుస్తున్నది.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండలంలో మంచు అధికంగా కురుస్తు న్నది. గురువారం ఉదయం 9 గంటల వరకు ముంచంగిపుట్టులో మంచు తెరలు వీడలేదు. మంచు కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలను దగ్గరకు వస్తేగాని గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహన చోదకులు లైట్ల వెలుగులో రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

నేడు పాడేరులో స్పందన కార్యక్రమం

పాడేరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ విజయసునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఏజెన్సీ ప్రాంతం ప్రజలు గమనించి తమ సమస్యలపై అర్జీలను స్పందనలో సమర్పించాలన్నారు. అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం ఉదయం పది గంటలకే ఐటీడీఏ కార్యాలయానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.


తేజస్ యుద్ధ విమానాల నుంచి బాంబుల ప్రదర్శన


ముఖ్యఅతిథికి స్వాగతం పలుకుతూ జాతీయ పతాకం రంగుల్లో నీటి బాంబుల ప్రదర్శన


యుద్ధ నౌకల నుంచి ఫైరింగ్


చేతక్ హెలికాప్టర్ ప్రదర్శన


కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మెరైన్ కమెండో

అంబరాన్నంటిన నేవీ సంబరం

... 5వ పేజీ తరువాయి

గర్జన చెవులను హోరెత్తించింది. కొత్తగా నౌకాదళంలో చేరిన సీ హాక్ హెలికాప్టర్లు, దేశీయ తయారీ తేజస్ యుద్ధవిమానం విశాఖ ప్రజల ముందు ప్రత్యక్షమయ్యాయి. నిఘా విమానాలు డార్నియర్లు, బోయింగ్‌తో తయారైన పీ8ఐ నిఘా విమానం సముద్ర రక్షణకు మేమున్నామని చాటాయి. విమాన వాహక నౌకలు విక్రాంత్, విరాట్‌లు వేదికకు ఎదురుగా సముద్రంలో కొలువుదీరాయి.

కలర్‌ఫుల్ పరేడ్

మిలాన్‌కు హాజరైన 51 దేశాల ప్రతినిధులు వారి జాతీయ పతకాలను చేబూని ఒకరి తరువాత మరొకరు కవాతు చేసుకుంటూ వచ్చిన దృశ్యం ప్రపంచం మొత్తం విశాఖలోనే ఉందా?...అనిపించింది. నేవీ స్కూల్ చిన్నారులు, కోరుకొండ సైనిక్ స్కూల్ పిల్లలు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బంగ్లాదేశ్, శ్రీలంక, వియత్నాం, రష్యా, ఇరాన్, మారిషస్, ఫ్రాన్స్ తదితర దేశాలతో పాటు ఏపీ పోలీస్, కోస్టుగార్డు, ఏపీ పోలీస్ బ్యాండ్, నేవీ బ్యాండ్ బృందాలు పాల్గొన్నాయి.


పరేడ్‌లో పాల్గొన్న ఇండోనేషియా కళాకారులు

క్రైం... crime news

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి


సంజీవరావు (ఫైల్)

గొలుగొండ, ఫిబ్రవరి 22: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ కృష్ణారావు అందించిన వివరాలివి. నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఏటిగైరంపేట నుంచి నర్సీపట్నం వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ శివారు గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన కాకర సంజీవరావు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. ఏటిగైరంపేట సమీపంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పక్కనే కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా పారబోయడంతో అవి తింటున్న కుక్కల గుంపు ఒక్కసారిగా రోడ్డుపై రావడంతో బస్సు అదుపుతప్పి ద్విచక్ర వాహనంపైకి దూసుకు వెళ్లినట్టు స్థానికులు తెలిపారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

నాతవరం, ఫిబ్రవరి 22: మండలంలోని తుని- నర్సీపట్నం రహదారిలో గల శృంగవరం సమీపంలో గురువారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కాకినాడ జిల్లాకు చెందిన కె.రత్నంతో పాటు నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బయ్యవురెడ్డిపాలెం నుంచి తుని వెళుతుండగా రోడ్డుకు అడ్డంగా ఉన్న కోతులను తప్పించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ఆటోలో చిక్కున్న ప్రయాణికులను ఇక్కడివారు బయటకు తీశారు. అయితే ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామారావు తెలిపారు.

విశాఖలో ఐపీఎల్ మ్యాచ్‌లు

మార్చి 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్

ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్ రైడర్స్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 22:

నగరంలో క్రికెట్ అభిమానులకు శుభవార్త. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండు మ్యాచ్‌లు పోతినమల్లయ్యపాలెంలో గల ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్నాయి. ఐపీఎల్ షెడ్యూల్‌ను గురువారం ప్రకటించారు. ఇందులో రెండు మ్యాచ్‌లు (మార్చి 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్, ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్ రైడర్స్) విశాఖకు కేటాయించారు.

ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌ను పంజాబ్ కింగ్స్‌తో మొహాలిలో, రెండో మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్‌లో ఆడనుంది. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లతో వరుసగా జరిగే మూడు, నాల్గో మ్యాచ్‌లను విశాఖలో ఆడడం విశేషం.

నాలుగేళ్ల తర్వాత

విశాఖలో నాలుగేళ్ల తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. 2012లో డెక్కన్ చార్జర్స్, 2015లో సన్‌రైజర్స్ హైదరాబాద్, 2016లో ముంబై ఇండియన్స్ జట్లు ఆడిన గ్రూపు స్టేజ్ మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికైంది. 2019లో ఐపీఎల్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు లేకపోయినా కీలకమైన ఎలిమినేటర్, క్వాలిఫైయర్-2 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది.

ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం

గోపాలపట్నం, ఫిబ్రవరి 22: మిలాన్-24లో పాల్గొనేందుకు గురువారం నగరానికి విచ్చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌కు ఐఎన్ఎస్ డేగాలో ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10.22 గంటలకు విశాఖ చేరుకున్న ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, తూర్పు నౌకాదళ ప్రధానాధికారి రాజేశ్ పెండార్కర్, అరకు ఎంపీ జి.మాధవి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో ఐఎన్ఎస్ చోళాకు బయలుదేరి వెళ్లారు. సముద్రిక ఆడిటోరియంలో నిర్వహించిన 'అంతర్జాతీయ మేరిటైమ్ సదస్సు'లో పాల్గొన్న అనంతరం ఉప రాష్ట్రపతి తిరుగు ప్రయాణమయ్యారు. ఢిల్లీ వెళ్లేందుకు మధ్యాహ్నం 12.30 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

28న పాడేరులో భువనేశ్వరి పర్యటన

పాడేరు రూరల్, ఫిబ్రవరి 22 : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న పాడేరు నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటించనున్నారని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి తెలిపారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు సమయంలో ప్రాణాలను విడిచిన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆదుకునేందుకు ఆయన సతీమణి భువనేశ్వరి ముందడుగు వేశారన్నారు. ఇందులో భాగంగా పాడేరు నియోజకవర్గం జి.మాడుగుల మండలం కిండంగిలో మరణించిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాల్సిందిగా ఆమె కోరారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529



మాఘ పౌర్ణమి జాతర

నేటి నుంచి పూడిమడకలో


తీరంలో కొలువైన మాధవస్వామి

- శుక్రవారం రాత్రి జాగారం, శనివారం ఉదయం సముద్ర స్నానాలు
- తీరంలో భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు
- జిల్లా నలుమూలల నుంచి లక్ష వరకు భక్తులు వస్తారని అంచనా
- భారీస్థాయిలో పోలీస్ బందోబస్తు
- శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సులు
- అచ్యుతాపురం-పూడిమడకల మధ్య ఆటోలు బంద్


పూడిమడకలో జగన్నాథస్వామి ఆలయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 22:

మాఘ పౌర్ణమి జాతరకు పూడిమడక ముస్తాబైంది. మాఘ పౌర్ణమికి ఇక్కడ వారం రోజులుపాటు జాతర జరుగుతుంది. శుక్రవారం రాత్రికి భక్తులు ఇక్కడ జాగరణ చేస్తారు. ఇందుకోసం భజనలు, చిటికెల భజనలు, తప్పెటగుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ జాతరకు లక్షకు పైగా భక్తులు శుక్రవారం సాయంత్రం నుంచి పూడిమడకకు వస్తారని అంచనా. రాత్రి జాగరణ చేసి శనివారం ఉదయం సముద్రంలో స్నానమాచరించి వందేళ్ల క్రితం నిర్మించిన సుభద్ర బలబద్ర సహిత జగన్నాథస్వామి, రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామిలను దర్శించుకుంటారు. మాఘ పౌర్ణమి సందర్భంగా పూడిమడక వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీరంలో ఏర్పాట్లు చేశారు. తీరంలో హౌమాస్ట్‌లైట్లు, మహిళలు బట్టలు మార్చుకోవడానికి టెంటులు టెంట్‌లు ఏర్పాటు చేశారు. జగన్నాథస్వామి ఆలయం వద్ద క్యూలైన్లను ఏర్పాటు చేశారు.


భక్తులు పూజలందుకోనున్న గంగాదేవి అమ్మవారు

శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సులు

పూడిమడకకు శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత నుంచి 10 అదనపు బస్సులు నడుపుతున్నామని అనకాపల్లి పీటీడీ డిపో మేనేజర్ సుజాత తెలిపారు. ప్రతి రోజూ తిరిగే షెడ్యూల్ బస్సులతో పాటు రాత్రి నుంచి 40 బస్సులు నడుపుతున్నామన్నారు. పూడిమడకకు కిలోమీటరు దూరంలో గల ఉన్నత పాఠశాల వద్ద తాత్కాలిక బస్టాండ్‌ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అచ్యుతాపురం-పూడిమడకల మధ్య షటిల్ నడుపుతున్నామన్నారు. అలాగే ఎలమంచిలి, కొండకర్ల జంక్షన్, గాజువాక, స్టీల్‌ప్లాంట్ నుంచి ప్రత్యేక బస్సులు పూడిమడకకు నడుపుతున్నారు.

తీరంలో భారీ బందోబస్తు

జాతర సందర్భంగా పూడిమడకలో భారీ స్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అచ్యుతాపురం-పూడిమడకల మధ్య అవుట్ పోస్టలను ఏర్పాటు చేస్తున్నారు. తీరంలో కూడా మెరైన్ పోలీసులతో కలిసి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదాల నివారణ కోసం అచ్యుతాపురం-పూడిమడకల మధ్య ఆటోలను శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు నిషేధించారు. పూడిమడక తీరంలో 30 మంది గజ ఈతగాళ్లను, ఆరు మర పడవలను పోలీసులు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు తెలిపారు. ముఖ్యంగా జేబుదొంగలపై నిఘా పెట్టామన్నారు. అలాగే జాతరకు వచ్చే మహిళలు బంగారు ఆభరణాలతో రావద్దని హెచ్చరించారు. సుమారు 130 మంది పోలీసులతో బందోబస్తుని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.

వాడపాలెం తీరం రెడీ

రాంబిల్లి : మాఘ పౌర్ణమి స్నానాలను భక్తులు ఆచరించేందుకు వాడపాలెం సముద్రతీరాన్ని సిద్ధం చేశారు. రాంబిల్లి పంచాయతీ శివారు వాడపాలెం సముద్ర తీరంలో ఈ నెల 24న జరిగే మాఘ పౌర్ణమి స్నానాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్లు దూరంలో వాడపాలెం సముద్ర తీరం ఉంది. శనివారం వేకువజాము నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడ సముద్రంలో మాఘస్నానాలు చేయనున్నారు. అనంతరం భక్తులు గంగా దేవి అమ్మవారిని దర్శించుకుంటారు. తీరంలో మాఘ స్నానాలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు రాంబిల్లి సర్కిల్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లో భక్తులు స్నానాలకు వెళ్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా లోవపాలెం, వెంకయ్యపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం సముద్రతీరాల వద్ద కూడా భక్తులు మాఘస్నానాలు ఆచరించనున్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో ఏర్పాట్లు

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరంలో మాఘ స్నానాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఇక్కడ పవిత్ర స్నానాలు ప్రారంభం కానున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. స్నానాలు అనంతరం తీరంలో కొలువైన మాధవస్వామిని భక్తులు దర్శించుకుంటారు. కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో నుంచి ముత్యాలమ్మపాలెం వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్టు అధికారులు వెల్లడించారు. తీరం వద్ద పరవాడ సీఐ బాలసూర్యారావు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. తీరంలో శుక్రవారం రాత్రి నుంచి జరగనున్న మాధవస్వామి తీర్థానికి దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతరకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధికసంఖ్యలో తరలివస్తారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాట్లు చేశారు.

రేవుపోలవరానికి 35 ప్రత్యేక బస్సులు

- 150 మంది పోలీసులతో బందోబస్తు


రేవుపోలవరంలో బస్సులు నిలిపే స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య

ఎస్.రాయవరం: మండలంలోని రేవుపోలవరం సముద్రతీరం వద్ద శనివారం జరిగే మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. పుణ్యస్నానం ఆచరించడానికి రేవుపోలవరం సముద్రతీరానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. నర్సీపట్నం డిపో నుంచి 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఇందులో భాగంగా రేవుపోలవరం సమీపంలో బస్సులు, ద్విచక్ర వాహనాలను నిలిపే స్థలాలను, సముద్రతీర ప్రాంతాన్ని గురువారం నర్సీపట్నం డీఎస్పీ డి. వెంకట్రామయ్య పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి డీఎస్పీ స్థానిక సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావులకు పలు సూచనలు చేశారు. జాతరకు 150 మందితో పోలీసు బందోస్తును ఏర్పాటు చేయనున్నట్టు సీఐ అప్పన్న చెప్పారు.

కోనాం చింతపండుకు గిరాకీ


అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింతపండు

చీడికాడ, ఫిబ్రవరి 22: కోనాం సంతకు ఏజెన్సీ గ్రామాల నుంచి తీసుకువచ్చిన చింతపండుకి మంచి గిరాకీ పలకడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం కొద్దిపాటి చింతపండు మాత్రమే సంతకు వచ్చింది. అది నాణ్యమైనది కావడంతో వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. కిలో రూ. 65 నుంచి రూ. 70 వరకూ ధర ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ మార్కెట్‌లో పెరిగిన హమాలి, కాటా చార్జీలు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 22 : అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో హమాలి, కాటా చార్జీలు పెరిగాయి. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్, సంచాలకులు రాహుల్‌పాండే ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అమలులో వున్న రేట్లు కంటే ఈ ధరలు 20 శాతం అధికం. బెల్లం 100 కిలోలకు ప్రస్తుత హమాలీ చార్జీలు రూ.13.39 పైసలు కాగా ఇది రూ.16.07 పైసలకు పెరిగింది. అలాగే కాటాదారు ఛార్జీలు రూ.4.03 పైసలు నుంచి రూ.4.84 పైసలుకు పెరిగింది. వేరుశెనగ 40 కిలోలకు హమాలీ చార్జీ రూ.6.05 పైసలు నుంచి రూ.7.26 పైసలకు పెంచారు. కాటాదారు ఛార్జీలు రూ.2.16 పైసలు నుంచి రూ.2.59 పైసలకు పెంచారు. నువ్వులు 75 కిలోలకు, ఎండుమిర్చి 20 కిలోలకు హమాలీ చార్జీ రూ.6.48 పైసలు నుంచి రూ.7.77 పైసలకు పెంచారు. నువ్వులు కాటా చార్జీ రూ.2.88 పైసలు నుంచి రూ.3.46 పైసలకు పెరిగింది. ఎండుమిర్చి కాటా చార్జీ రూ.2.16 పైసలు నుంచి రూ.2.60 పైసలకు పెరిగింది. ఉల్లిపాయలు 70 కిలోలకు హమాలీ చార్జీ రూ.8.64 పైసలకు, కాటాదారు చార్జీ రూ.2.60 పైసలకు పెరిగింది. మిగతా వ్యవసాయ ఉత్పత్తుల హమాలి, కటాదారు చార్జీలు 75 కిలోల కంటే తక్కువ ఉన్నప్పుడు హమాలీ చార్జీ రూ.7.76 పైసలు, కటాదారు చార్జీలు రూ.2.60 పైసలకు పెంచారు. 75 కిలోల కంటే అధికంగా ఉంటే హమాలీ చార్జీలు రూ.9.50 పైసలు, కాటాదారు చార్జీలు రూ.3.46 పైసలుగా నిర్ణయించారు. ఈమేరకు గెజిట్ నోట్ విడుదలైంది.

చేతకాని పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్

- మంత్రికి కోడిగుడ్డును పార్శిల్ చేసిన టీడీపీ నేత


అనకాపల్లి పోస్టాఫీస్ వద్ద కోడిగుడ్లతో టీడీపీ నాయకులు

అనకాపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేతకాని ఏకైక మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ విమర్శించారు. ఇటీవల శంఖారావం సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పార్శిల్ ద్వారా అందించమని ఇచ్చిన కోడిగుడ్డును గురువారం టీడీపీ నాయకులతో కలిసి హెడ్ పోస్టాఫీసులో మంత్రి అమర్‌నాథ్ అడ్రస్‌కు పార్శిల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమర్‌నాథ్ చేతకాని మంత్రి అని స్వయంగా ఆ పార్టీ అధినేతే గుర్తించి రానున్న ఎన్నికల్లో టికెట్ కేటాయించకుండా కుర్చీని మడత పెట్టేశారన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఐదేళ్లల్లో చేసిన అక్రమాలు, భూదందాలు, కబ్జాలు గురించి నియోజకవర్గం కోడై కూస్తుందన్నారు. నారా లోకేశ్ రాష్ట్రానికి దేశ విదేశాల నుంచి వందలాది కంపెనీలను తీసుకు వచ్చి లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చారన్నారు. అలాంటి వ్యక్తిని ఒక్క కంపెనీని కూడా తీసుకురాని చేతకాని మంత్రి విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. వైసీపీ పాలనలో ఐటీ రంగం కుదేలైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి బాబి, జగ్గారావు, మరపురెడ్డి సత్యనారాయణ, సూర్య, తోటాడ విజయ్, పృథ్వీ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ తవ్వకాలు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో వైసీపీ నాయకులే ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు నిజమేనని కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ హైకోర్టుకు నివేదిక ఇచ్చిందన్నారు. కొంతమంది కలెక్టర్ల సహకారంతోనే ఇసుక క్వారీలు నడపడం దారుణమన్నారు. ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా వైసీపీ నాయకులు కోట్లు గడించారని, దీనికి సీఎం జగన్ సమాధానం చెప్పాలని బుద్ధ డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాలతో దోచుకున్న సొమ్మును రానున్న ఎన్నికల్లో వెదజల్లేందుకు వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారని బుద్ధ వ్యాఖ్యానించారు. జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న అనధికార క్వారీలపై కలెక్టరుకు టీడీపీ తరుపున ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు బి. శ్రీనివాసరావు, సత్యనారాయణ, తెలుగు మహిళ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయమా? వైసీపీ కార్యాలయమా?

- ఖాజీపాలెం వాసుల విస్మయం


సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సిద్ధం కటౌట్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 22: రంగులు, ఫొటోలు పిచ్చి శృతి మించి సచివాలయ భవనానికి సిద్ధం కటౌట్‌ను పెట్టేశారు స్థానిక వైసీపీ నాయకులు. ఈ కటౌట్‌ను చూసి స్థానికులు ఇది ప్రభుత్వ భవనమా? వైసీపీ కార్యాలయామా అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని ఖాజీపాలెంలో పంచాయతీ భవనాన్ని టీడీపీ హయాంలో నిర్మించారు. దీనిని అప్పటి ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన శిలాఫలకం ఉంది. అయితే ఇదే పంచాయతీ భవనంపై తాజాగా సచివాలయాన్ని కూడా నిర్మించారు. అయితే వైసీపీ నాయకులు గతంలో పంచాయతీ భవనం శిలాఫలకాన్ని న్యూస్‌పేపర్లు అంటించి కప్పేశారు. మొదటి అంతస్తులో సచివాలయాన్ని ఈనెల 20న ఎమ్మెల్యే కన్నబాబు రాజు ప్రారంభించారు. అయితే ఈ కార్యాలయం వదంద జెండాలు కట్టారు. అంతేకాక సచివాలయం భవనానికి సిద్ధం కటౌట్‌ని కూడా పెట్టారు. ప్రస్తుతం పంచాయతీ భవనం వైసీపీ కార్యాలయ భవనంలా కనబడుతోందని స్థానికులు అంటున్నారు.

శివారు పొలం వరకు సాగునీరు అందాలి

▸ అధికారులకు పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం

▸ కె.కోడాపల్లి పంచాయతీలో తాబేలు గుమ్మి చెక్‌డ్యామ్ పరిశీలన



చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

జి.మాడుగుల, ఫిబ్రవరి 22 : మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీలో పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బందవీధి తాబేలు గుమ్మి చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. రిటైనింగ్ వాల్ పనులపై ఆరా తీశారు. చెక్‌డాంలో ఉన్న మూడు షట్టర్లకు మరమ్మతులు పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని సదరు సిబ్బందికి సూచించారు. పూడికతీత పనులు చేపట్టడం ద్వారా సుమారుగా పదివేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. సాగునీరు వృథా కాకుండా శివారునున్న పొలం వరకు అందాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఐ ఈఈ ఆర్.నాగేశ్వరరావు, ఏఈ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ ఏదీ..?

▸ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన టీడీపీ నాయకుడు దొన్నుదొర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సియ్యారి దొన్నుదొర

అరకులోయ, ఫిబ్రవరి 22 : గిరిజన నిరుద్యోగ యువతకు ప్రత్యేక డీఎస్సీని ప్రకటిస్తామని నాడు మాట ఇచ్చి, నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విస్మరించారని, ఇది మడమతిప్పి మోసం చేయడం కాదా.. అని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర ప్రశ్నించారు. గురువారం తన నివాసంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీలో గిరిజన యువతకు సీఎం మొండిచెయ్యి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాల్లో భారీగా ఖాళీలు ఉన్నప్పటికీ వాటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడంలో విఫలమయ్యారన్నారు. ఇది ఆదివాసీలకు అన్యాయం చేయడం కాదా అన్నారు. ఆదివాసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠాలు బోధించేవారు లేక వారు చదువులో వెనుకబడిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో 1534 పోస్టులు ఖాళీగా ఉంటే, నేడు ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో కేవలం 517 పోస్టులు మాత్రం భర్తీ చేస్తుండడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన సంక్షేమశాఖ, గురుకులాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ అరకు మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, నాయకులు సాయిరాం, స్వాబిదొన్ను, కిల్లో ఆనంద్, పాడి చందూ, సుబ్బారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ లబ్ధిదారుల ఆధార్ నమోదు

అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి ఆర్‌జేడీ చిన్మయాదేవి సూచన



కువిరియా భాషలో ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న చిన్మయాదేవి

కొయ్యూరు, ఫిబ్రవరి 22 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సంపూర్ణ పోషణలో లబ్ధిదారుల ఆధార్‌ను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయాదేవి సూచించారు. గురువారం కొయ్యూరు ప్రాజెక్టు కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వం ఇటీవల పీవీటీజీ లబ్ధిదారుల పిల్లలకు ప్రీస్కూల్ పీపీ-1, 2 ప్రీస్కూల్ బోధనకు వీలుగా కువిరియా భాషలో ముద్రించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ గోతిలో పడి ఎద్దు మృతి



జి.మాడుగుల, ఫిబ్రవరి 22 : మండలంలోని కోరాపల్లిలో ఓ సెల్ టవర్ ఏర్పాటు నిమిత్తం తీసిన గోతిలో ఎద్దు పడి మృతి చెందింది. ఇందుకు సంబంధించి బాధిత రైతు కోరాబు కోటి కిరణ్ నాయుడు తెలిపిన వివరాలివి. గ్రామ సమీపంలో సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించి పైపులు వేసేందుకు గోతులను తీశారు. వాటిని పూడ్చకుండా వదిలేయడంతో ఎప్పటిలాగే అటుగా వెళ్లిన తన ఎద్దు కాలుజారి గురువారం అందులో పడిపోయిందన్నాడు. అనంతరం అక్కడికక్కడే మృతిచెందినట్టు వాపోయాడు. ఆర్థికంగా నష్టపోయిన ఆదుకోవాల్సిందిగా కోరుతున్నాడు.

డీఈవోను కలిసిన 'సీపీఎస్' నేతలు

పాడేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావును సీపీఎస్ ఉద్యోగుల సం ఘం నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలు ఎం.ఈశ్వరరావు, జె.తెల్లబాబు, కె.రాంబాబు, ఎం.మోహనరావు, యువరాజు, లింగన్న, హరిబాబు, డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

... 5వ పేజీ తరువాయి

గిరిజన సంఘం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్న షెడ్యూల్ ఆదివాసీ ప్రాంతంలో శతశాతం ఆదివాసీలు ఉన్న అల్లూరి, మన్యం జిల్లాలో ఆదివాసీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకొని ఆదివాసీ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్, జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణారావు, ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ నరేష్, కో-కన్వీనర్లు చంటి, మత్స్యరాజు, కృష్ణ, నూకరాజు, ఉపేంద్ర, లక్ష్మణ్, అర్జున్, వెల్సన్‌నాయుడు పాల్గొన్నారు.



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ మాతృ భాష వలంటీర్లు



కొయ్యూరులో నినాదాలు చేస్తున్న దృశ్యం

సమస్యలపై భాషా వలంటీర్లు ఆందోళన

▸ విద్యా సంవత్సరం ఆరంభంలోనే రెన్యువల్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ ▸ మండల కేంద్రాల్లో ర్యాలీలు ▸ ఎంఈవోలకు వినతులు



ముంచంగిపుట్టులో ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఆందోళన

చింతపల్లి, ఫిబ్రవరి 22 : మాతృభాషా వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సంఘం మండల అధ్యక్షుడు మర్రి బాబి డిమాండ్ చేశారు. గురువారం మాతృభాషా వలంటీర్లు మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టి ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ భాషా వలంటీర్లను ప్రభుత్వం సీఆర్‌టీలుగా పరిగణించాలన్నారు. ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలోనే రెవెన్యువల్ చేస్తూ పాఠశాలల్లో నియమించాలని కోరారు. సంఘం నాయకులు చంద్రమ్మ, బాలరాజు, మహేశ్, రాజబాబు, చిరంజీవి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : జీపీఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా వలంటీర్లు తమ సమస్యలపై డుంబ్రిగుడలో ఆందోళన చేపట్టారు. మూడు రోడ్ల జంక్షన్ నుంచి ఎంఈవో కార్యలయం వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి, ఎంఈవో సుందరరావుకు వినతి పత్రం అందజేశారు. సంఘం మండల అధ్యక్షురాలు పి.కుమారి మాట్లాడుతూ వేతనాలు పెంచాలని కోరారు. సంఘం నాయకులు పి.బుజ్జిబాబు, టి.సత్యనారయణ, ఎం.సింహాచలం, దస్మత్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న మాతృ భాషా వలంటీర్లను కొనసాగించాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి వి.చంద్రయ్య కోరారు. సమస్యల పరిష్కారానికి గురువారం మాతృభాషా వలంటీర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేశారు. అనంతరం చంద్రయ్య మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలోనే తమను రెన్యువల్ చేయడంతో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, ఆయా సంఘాల నాయకులు కె.కొండయ్య, కె.గణేశ్, కె.త్రినాథ్, ఎం.ఎం.శ్రీను, పి.వెంకటరమణ, పుణ్యవతి, దేవి, సిద్దేశ్, కృష్ణ, బంగారయ్య, ప్రకాష్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : ఆదివాసీ గ్రామాలలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో పనిచేస్తున్న బహుభాషా వలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారంతా గురువారం కొయ్యూరులో ఆందోళన చేపట్టారు. విద్యా సంవత్సరం ఆరంభంలో తమ సర్వీసును రెన్యువల్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నేత ఎస్.సూరిబాబు వీరికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాషా వలంటీర్లు కొర్రా రమణబాబు, తాంబేలి చిట్టిబాబు, చిరంజీవి, పాంగి చిన్నారావు, మర్రి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ఎంఈవో సుందరరావుకు వినతి

'శివారు గిరిజన గ్రామాలకు జీఎస్‌బీ రహదారులు'



రహదారి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి, ఫిబ్రవరి 22 : ఏజెన్సీలో శివారు గిరిజన గ్రామాలకు గ్రాన్యులర్ సబ్- బేస్ (జీఎస్‌బీ) రహదారులు నిర్మిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని కొమ్మంగి పంచాయతీ కిక్కిసల బంద, లుబ్బగుంట రహదారుల నిర్మాణాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. శివారు గ్రామాల నుంచి ప్రధాన కేంద్రాలను అనుసంధానం చేస్తూ రహదారులను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ రహదారుల వల్ల ఆదివాసీలకు రవాణా కష్టాలు తీరుతాయన్నారు. అనంతరం చింతపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. ఎంపీపీ కోరాబు అనుషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో వీర సాయిబాబు, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, కొమ్మంగి సర్పంచ్ పాంగి లక్ష్మి, ఎంపీటీసీ జర్త రూతు, దాసరి దారలక్ష్మీపద్మ, జయలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ మోరి రవి, వైస్ ఎంపీపీలు సాగిన వెంగళరావు, గోపీనాయక్, శారద తదితరులు పాల్గొన్నారు.

చెరువూరు పోలింగ్ కేంద్రం మార్పు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాధాకృష్ణ మూర్తి

చింతపల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి తెలిపారు. గురువారం వివిధ పార్టీ నాయకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలను నాయకులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. బలపం పంచాయతీ పరిధిలో చెరువూరు పోలింగ్ కేంద్రాన్ని భద్రతా కారణాల వల్ల మార్పు చేశామన్నారు. బలపం ఆశ్రమ పాఠశాలలోనే చెరువూరుకు సంబంధించి ప్రత్యేక బూత్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వైసీపీ నాయకులు మోరి రవి, టీడీపీ నాయకులు రీమల ఆనందరావు, నాగ భూషణం, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, దాసరి ధారలక్ష్మి పద్మ పాల్గొన్నారు.

ఆసరా పథకం చెక్కులు పంపిణీ

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 22 : ఇక్కడి అల్లూరి గ్రౌండ్‌లో నాలుగో విడత ఆసరా పథకం నమూనా చెక్కుల పంపిణీని గురువారం చేపట్టారు. ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీటీసీ గీత, ఐకేపీ పీడీ మురళి, ఏపీవో సూరిబాబు, డీపీఎం నీలకంఠం, దాసు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నేడు అడవిరాజుబాబుల పండగ

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 22 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు వద్ద గల ఆలయంలో శుక్రవారం అడవిరాజుబాబుల పండగ జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ ధర్మకర్త కొమ్మనాపల్లి రామారావు తెలిపారు.

24న అరకులో వైసీపీ సభ

అరకులోయ, ఫిబ్రవరి 22 : వైసీపీ అరకు అసెంబ్లీ సమన్వయకర్తగా ఉన్న రేగం మత్స్య లింగంను పార్టీ అధిష్టానం అన్ని కోణాల్లో ఆలోచించి అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించిందని, అతని విజయానికి అంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ అరకు పరిశీలకురాలు శోభా హైమావతీదేవి పిలుపునిచ్చారు. గురువారం ఇక్కడ జరిగిన పార్టీ నియోజకవర్గ నాయకులు సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 24న అరకులోయలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పార్టీ బహిరంగ సభను అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు. పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్ తదితరులు హాజరు కానున్నారన్నారు.అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు ఏడు గంటలే విద్యుత్ సరఫరా..!

గొలుగొండ, ఫిబ్రవరి 22 : వ్యవసాయ మోటార్లకు ఏడు గంటలే విద్యుత్తును సరఫరా చేస్తుడడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా జనవరి 31వ తేదీ వరకూ చేసింది. అయితే రెండు వారాలుగా ఏడుగంటలే సరఫరా చేస్తుండడంతో వివిధ రకాలైన కూరగాయలు, అపరాల పంటలకు సాగుకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మండలంలోని కృష్ణాదేవిపేట, గొలుగొండ, ఏటిగైరంపేట ల్లో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బోర్లకు 980 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఏడు గంటలే విద్యుత్ ఉంటుండడం, దీనికి తోడు ఎండలు ముదురుతుండడంతో పంటల పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు

రైతులకు రాయితీపై అత్యాధునిక యంత్రాలు

చింతపల్లి/ గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 22 : గిరిజన ప్రాంతంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులకు విలువలు జోడించే అత్యాధునిక యంత్రాలను రాయితీపై అందించనున్నట్టు స్పైస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బొడ్డు కల్యాణి తెలిపారు. గురువారం అసరాడ గ్రామంలో చింతపల్లి, జీకేవీధి మండలాల్లో సదరు యంత్రాలను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. ఆదివాసీ రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు నేరుగా విక్రయించుకోవడం వల్ల గరిష్ఠ ధర పొందలేకపోతున్నారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను శుద్ధి, గ్రేడింగ్ చేసి విక్రయించుకోవడం వల్ల అంతర్జాతీయ ధరలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే స్పైస్ బోర్డు నుంచి చింతపల్లి, జీకేవీధి మండలాలకు చెందిన రైతులకు 75శాతం రాయితీ, థింసా ఆర్గానిక్, చింతపల్లి ఆదివాసీ, నంది దేవర రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 90శాతం రాయితీపై కాండం నుంచి గింజలను వేరు చేసి, గ్రేడింగ్ చేసే మిరియాల యంత్రం, పసుపు పాలిషర్లు, అల్లం శుద్ధి చేసే యంత్రాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో థింసా ఆర్గానిక్ ఎఫ్‌పీవో ప్రతినిధులు వీఎస్‌జే ఆనంద్, అరుణ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పసుపు పాలిష్ యంత్రాల పంపిణీలో బోర్డు ఫీల్డ్ అధికారి కల్యాణి

జర్నలిస్టులపై దాడులు ఆపి.. పత్రికాస్వేచ్ఛను కాపాడాలి

జిల్లా కలెక్టర్ విజయసునీతకు పాత్రికేయులు, ప్రజా సంఘాలు, పార్టీల నేతలు వినతి



ముంచంగిపుట్టులో నినాదాలు



కలెక్టర్ విజయసునీతకు వినతిపత్రం సమర్పిస్తున్న పాత్రికేయులు

పాడేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే జర్నలిస్టులపై దాడులను అరికట్టి, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని జిల్లా కేంద్రం పాడేరులో పాత్రికేయులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ విజయసునీతను గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన పలు ఘటనలపై ఇండియన్ జర్నలిస్టు యూనియన్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బి.నాగరాజు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారనే అక్కసుతో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాలకుల తప్పులు, వైఫల్యాలను ఎత్తిచూపే బాధ్యత జర్నలిస్టులపై ఉందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ 'సిద్ధం' సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటో స్టాఫ్ గ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి, కర్నూలు జిల్లాలో మద్దికేర 'ఆంధ్రజ్యోతి' విలేకరి వీరశేఖర్‌పై, కర్నూలు 'ఈనాడు' కార్యాలయంపై వైసీపీ మూకల దాడుల తీరును వివరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పి.సత్యనారాయణ, డి.శివబాబు, జె.శ్రీనివాస్, కె.మహేశ్, ఓ.జ్ఞానప్రకాశ్, బి.హరిబాబు, ఎస్.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ : జర్నలిస్టులపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడుతుండడం దారుణమని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర గురువారం అన్నారు. రాప్తాడులో జరిగిన సీఎం 'సిద్ధం' సభ కవర్ చేసేందుకు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ఫొటో గ్రాఫర్‌పై వైసీపీకి చెందిన రైడీలు దాడిచేయడం దుర్మార్గమన్నారు.

జి.మాడుగుల : జర్నలిస్టులపై వైసీపీ ముకలు దాడులు దారుణమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు అన్నారు. గురువారం ఇక్కడ పార్టీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో వైసీపీ శ్రేణుల తీరును ఖండించారు. ఈ సమావేశంలో నాయకులు కె.కల్యాణం, పి.భీంబాబు, పి.కృష్ణమూర్తి, కె.లక్ష్మణరావు, వి.చిరంజీవినాయుడు, ఎం.నారాయణరాజు, కె.చిన్న, ఎస్.రమణబాబు, బెన్నలింగం, మాధవరావు, ఎం.రాజు, డి.రామరావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : జర్నలిస్టులపై వైసీపీ మూకలు దాడి దారుణమని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్, ఈనాడు కార్యాలయం, పెదబయలు ఆంధ్రప్రభ విలేకరిపైన ఇటీవల జరిగిన దాడులకు నిరసనగా స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో గురువారం ఆందోళన చేపట్టారు. సీపీఎం, సీఐటీయూ, గిరిజన సంఘం, ఆదివాసీ మహిళా సంఘం, మాతృభాషా వలంటీర్ల సంఘాల నాయకులు తమ మద్దతు తెలిపారు. సంఘాల నాయకులు కె.శంకరరావు, పి.భీమరాజు, వి.చంద్రయ్య, కొండయ్య, నర్సింగరావు, ఈశ్వరి, విజయ, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కాంతారు మోహన్, పి.విజయ్ వెంకట్, బెహరా ప్రసాద్, పి.భాస్కరరావు, కె.ఈశ్వరరావు, కె.రాంబాబు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

కంటబౌంసుగుడ హెచ్‌డబ్ల్యూవో సస్పెన్షన్

అరకులోయ, ఫిబ్రవరి 22 : అరకులోయలోని కంటబౌంసుగుడ టీడబ్ల్యూ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌డబ్ల్యూవో మాధవిని ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. వారం రోజుల క్రితం ఈ పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థిని సెలవుపై ఇంటికి వెళ్లి వసతి గృహానికి చేరుకుంది. అనంతరం అరగంటలోనే తానుండే వసతి గృహం గదితో ఉరివేసుకుని మృతిచెందింది. ఈ కారణంగా హెచ్‌డబ్ల్యూవో మాధవిని సస్పెన్షన్ చేస్తూ పాడేరు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్టు అరకు ఏటీడబ్ల్యూవో మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి



గర్భిణి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సీడీపీవో

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 22 : గర్భిణులు, బాలింతలు టేక్ హోం రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో ఎ.లక్ష్మీదేవి సూచించారు. మండలంలోని గుమ్మిరేవుల పంచాయతీ దొరగొంది, ధారకొండ అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సకాలంలో తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి : ఎస్ఐ



విజేతలకు షీల్డు, కిట్లు అందజేస్తున్న ఎస్ఐ

జి.మాడుగుల, ఫిబ్రవరి 22 : గిరిజన యువత ఆటలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా గురువారం నుర్మతి అవుట్ పోస్ట్ ప్రాంగణంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఆరు జట్లు తలపడగా, నుర్మతి పంచాయతీ డిప్పలగొంది జట్టు ప్రథమ, అదే పంచాయతీ చెరువీధి జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు సీఆర్‌పీఎఫ్ ఓసీ ఉదయ్ చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

'కేంద్ర నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి'



గుత్తులపుట్టులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పాడేరురూరల్, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్లుగా కేంద్రం నిధులతోనే అభివృద్ధి సాగుతోందని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు అన్నారు. పార్టీ పిలుపు మేరకు ప్రజా పోరు యాత్రను గురువారం గుత్తులపుట్టు, సంతబయలు గ్రామాల్లో నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో మోదీ చేసి చూపిస్తారన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు జగన్‌రెడ్డి చేతిలో కాలుబొమ్మల్లా మారిపోయారని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సైతం దారి మళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురుసా పార్వతమ్మ, నందోలి గాసన్న, కాకరి చిన్నయ్య, సల్లా రామకృష్ణ, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎల్ఐపీ ప్రొగ్రామ్ అమలు పరిశీలన



కొత్తభల్లుగుడ పాఠశాలలో రాష్ట్ర బృందం సూచనలు

అరకులోయ,ఫిబ్రవరి 22 : గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలల్లో ఎల్ఐపీ ప్రొగ్రామ్ అమలు తీరు తెన్నులను పరిశీలించేందుకు గురువారం రాష్ట్ర బృందం అరకులోయలో పర్యటించింది. తరగతి గదిలో పాఠాల బోధన తదితరాలను బృందం సభ్యులు పి.ఈశ్వరరావు, సీహెచ్.ఎన్.దొర పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భారతీరత్నం తదితరులు పాల్గొన్నారు.